జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 10 | జనవరి | 2025 | పేజీలు : 5

# ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగళం

-రూ. 2వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

-ఔట్‌సోర్సింగ్ టీచర్‌కి జీతం చెల్లించే విషయంపై లంచం అడిగిన ప్రిన్సిపాల్

-ఎవరైనా లంచం అడిగితే 1064కు సమాచారం ఇవ్వాలి - ఏసీబీ డీఎస్పీ వై. రమేష్




**ఇల్లందు/ జనవరి 9, (ప్రజాజ్యోతి)**

ప్రభుత్వం ద్వారా వచ్చే వేతనాలు సరిపోక కొందరు ప్రభుత్వ ఉద్యోగులు లంచాలకు అలవాటు పడుతున్నారు. ఏసిబి అధికారులు వల పన్ని పట్టుకున్న కానీ ఎదో ఒక దగ్గర అవినీతి అధికారుల లంచాలకు మాత్రం కళ్లెం పడడం లేదనేది వాస్తవం. ఇదే కోవలో ఇల్లందు మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ,

# అపురూపం రాములోరి జలవిహారం..



## అలల ఊయలపై భద్రాద్రి రాముడు..!!
## సీతారాముల జలవిహారం ముగ్ధ మనోహరం...!

**భద్రాచలం, జనవరి 9 (ప్రజాజ్యోతి ):** భాజా భజంత్రీల సందడి...! వేద ఘోష పరిమళాలు...! మిరిమిట్లు గొలిపే వెలుగు జిలుగులు...! అశేష భక్తజన సందోహం...! 'హైలెస్సో హైలెస్సా' అంటూ ఆ చూడాముచ్చటైన జంట నదీ విహారం...! జగదభి రామ జానకి రామా అంటూ భక్తుల జయ జయ ద్వానాలు...! శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతంగా గావించిన తెప్పోత్సవం కనులారా వీక్షించిన భక్తజనం .... ఆబాలగోపాలాన్ని మైమరిపించిన తెప్పోత్సవం



మిగతా 2లో..



# కార్పొరేషన్ బాట పట్టారు
## క్రమబద్ధీకరణ పట్టాలు.. మరిచారు..

- జిల్లా రెవిన్యూ మంత్రి దృష్టి సారించరూ..
- ఎదురు చూస్తున్న పట్టణ ప్రజానీకం..




**కొత్తగూడెం / జనవరి9, ( ప్రజాజ్యోతి) :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆవిర్భవించిన తర్వాత కార్పోరేషన్ దిశగా అడుగు ముందుకు వేసింది. ఇదంతా అందరికి సంబురంగా ఉన్నప్పటికీ కొన్నేళ్ల తరబడి ఎదురు చూస్తున్న పట్టణ ప్రజానికం తన సొంత ఇంటిపై యాజమాన్యంపు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం మంజూరు చేయాల్సిన క్రమబద్ధీకరణఫ పట్టాల కోసం నీరక్షణ తప్పడం లేదు. ప్రభుత్వాలు మారినప్పటికీ పట్టణ ప్రజల కోసం అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. క్రమబద్ధీకరణ పట్టాల కోసం మిగతా 2లో..

# సంక్రాంతికి అందరూ బిజీనే!



- మహిళలు పండగ హడావిడిలో
- పురుషులు సినిమాల సందడిలో
- యువకులు గాలిపటాల జోష్‌లో
- సెల్ఫీల మోజులో యువతులు
- చిన్నారులు వృద్ధులు పిండి వంటలు ఆరగించే పనిలో

**ఇల్లందు/జనవరి 9, (ప్రజాజ్యోతి):**

సంక్రాంతి పండగ వస్తుందంటే ప్రతి ఒక్కరు సంతోషంగా తమ కుటుంబాలతో గడపడం సర్వసాధారణం. కానీ ఈ సంక్రాంతికి మాత్రం ఎవరి బిజీలో వారు ఉండే పరిస్థితి నెలకొంది. ఎందుకంటే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 10న రామ్ చరణ్ గేమ్ చేంజర్, 12న బాలకృష్ణ డాకు మహారాజ్, 14న వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాలో విడుదల కానున్నాయి. దీంతో మహిళలు ఇంట్లో పిండి వంటలు మిగతా 2లో..

# అపురూపం రాములోరి జలవిహారం



(మొదటి పేజీ తరువాయి)

దక్షిణ అయోధ్య భద్రాచలం మురిసి మెరిసింది...! భద్రాచలం మహా పుణ్యక్షేత్రం. పుణ్య తీర్థం కూడా. ముక్కోటి వేడుక తరతరాలుగా సాంప్రదాయ బద్ధంగా ఇక్కడ వైభవంగా జరుపుతారు. ఈ ఏడాది శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంకాల సంధ్యా సమయాన భద్రాచల పవిత్ర పావన గౌతమి నదీ తీరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి జలవిహారం వేడుక కనుల పండుగగా, కమనీయంగా, రమనీయంగా నిర్వహించారు. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల రామాలయంలో తొలుత వేద పండితులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాజభజంత్రీల సందడి నడుమ, పల్లకిపై శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని వేంచేయింపచేసి, భక్తుల జయ జయ ద్వానాలతో ఊరేగింపుగా పవిత్ర గౌతమీనది తీరానికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపు హంస వాహనంపై శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని కూర్చుండబెట్టి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదికి హారతులు ఇచ్చారు. వేద మంత్రాలను పఠించారు. విద్యుత్ కాంతులు మిరుమిట్లు గొలుపుతుండగా, గోదారమ్మ పులకిస్తుండగా, శ్రీరామ జయరామ అంటూ భక్తులు నినదిస్తుండగా, వేదగోష పరిమళాలు వెదజల్లుతుండగా ఆ చూడాముచ్చటైన అపురూప జంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారు జలవిహారం చేసిన తీరు భక్తులను తన్మయానికి గురిచేసింది. బాణాసంచా సందడి భక్తులను అలరించింది. పవిత్ర పావన గౌతమీ నదీ తీరంలో ఐదు సార్లు హంస వాహనంపై తిరుగుతూ వైకుంఠ రాముడు భక్తులకు సాక్షాత్కరించారు. మరోవైపు రకరకాల విద్యుత్ కాంతులతో బాణాసంచా కాల్చిన తీరు భక్తులను తన్మయానికి గురిచేసింది. గోదావరి ఇసుక తిన్నలపై కూర్చొని కనులారా ఈ వేడుక తిలకించిన భక్తజన హృదయాలు ఉప్పొంగాయి. శ్రీరామ..జయ రామ అంటూ భక్తులు చేసిన జయ జయ ద్వానాలు మిన్నంటాయి. గోదావరి తీరం అంతా జనసంద్రమైంది. గోదావరి తీరం వద్ద ప్రత్యేక ఆకర్షణగా ఈసారి అధికారులు తీసుకున్న చర్యలు భక్తులను ఆకర్షించాయి. భద్రాచలంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ స్వామివారి తెప్పోత్సవ వేడుకలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, దేవాలయ వేద పండితులు, ఉద్యోగులు,అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


# కార్పొరేషన్ బాట పట్టారు.. క్రమబద్ధీకరణ పట్టాలు మరిచారు.

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత జీవో నెం. 76 ద్వారా పట్టాలు మంజూరు చేసేందుకు గతంలో దరఖాస్తులు ఆహ్వానించారు. పట్టణ ప్రజలు ఇబ్బడి ముబ్బడిగా పట్టాలు పొందెంకు 2023లో సుమారు 2300 మంది లబ్ధి దారులు చేసుకున్న ధరకాస్తులకు నేటి వరకు కార్యాచరణ దాల్చలేదు. ప్రభుత్వం వారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక భద్రాద్రి జిల్లాలో రెవిన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి దృష్టి సారించి క్రమబద్ధీకరణ పట్టాలు మంజూరు చేస్తారని పట్టణ ప్రజలు ఆశ పడుతున్నారు. కొత్తగూడెం పట్టణం వంద సంవత్సరాలు లీజ్ అగ్రిమెంట్తో 1985 సింగరేణి సంస్థ లీజు ముగిసింది. ఆ తరువాత సర్వే నెంబర్ 141,42,43 సుమారు 400 ఎకరాల భూమి కొత్తగూడెం మునిసిపాలిటీకి అప్పగించింది. దీంతో కొత్తగూడెం పట్టణంలో గత వంద సంవత్సరాల నుంచి వ్యాపారస్తులు పట్టణ అభి వృద్ధి కోసం ఇళ్ల స్థలాలు సింగరేణి సంస్థకు సబ్ లీజుకు ఇచ్చింది. ఉదా: కొత్తగూడెం రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, పెట్రోల్ బంక్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ తదితర వాటికి క్రయ విక్రయాలకు నోచుకున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి కొన్ని కోట్ల రూపాయలు లాభం చేకూరింది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ 2005 సంవత్సరంలో అప్పటి రెవిన్యూ శాఖ జీవో నెం. 73 ఏర్పాటు చేసి ప్రజల ఆస్తులను అన్యాక్రాంతంగా ఉన్నట్టు పేర్కొని వాటికి పట్టా ప్రక్రియను ఏర్పాటు చేసింది. దీనివల్ల చాలామంది ప్రజలు అవగాహన లేక కొంతమంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. తదుపరి కాల క్రమేన రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాలు జరపలేదు. కేవలం పట్టా కలిగగిన వ్యక్తుల ఆస్తులు మాత్రమే క్రయ విక్రయాలకు నోచుకుని బ్యాంకులో తాకట్టు రూపాన రుణాలు పొందడం ప్రక్రియ జరిగింది. 2005 జీవో రాక ముందు పట్టణంనలో వ్యాపారస్తులు ఇళ్లు కొనుగోళ్లు ఎటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు పొందారు. దీనివల్ల రాజకీయ ఒత్తిడిలు , లావాదేవిలు సంబంధించి తదుపరి మరికొన్ని జీవోల ద్వారా దరఖాస్తు చేసుకునేవారికి అనేక ఇబ్బందులు చూపించి జాప్యం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలో వచ్చినంకా తిరిగి జీవో నెంబర్ 76 తెరపైకి వచ్చింది. ఆ జీవోను సాధించడంలో కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు వ-నమా వెంకటేశ్వరరావు ఎంతో ఉందని చెప్పవచ్చు. అప్పట్లోనే ఆ జీవో ప్రకారం తిరిగి క్రమబద్ధీకరణ పట్టాల కోసం రెండో విడతగా దరఖాస్తులను స్వీకరించారు. 2023వ సంవత్సరంలో 2300 మందికి సర్వే చేసిన దరఖాస్తులు, సంబంధిత అధికారులు, 2024లో ఎన్నికల కోడ్ రాక ముందే అటు దరఖాస్తును పూర్తిగా సర్వే చేపించి సిసి ఎల్ హైదరాబాద్ వారికి కంప్యూటరైజడ్ చేసి సమర్పించారు. 2 నెలల తరువాత ఎన్నికల కోడ్ అమలు అయిన తరువాత దరఖాస్తు దారులందరికీ ఇప్పటి వరకు కూడా పట్టాలు అందించలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ సమాచారం అంతా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని జిల్లా కలెక్టర్ దృష్టికి పలు మార్లు తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఇప్పటి వరకు కూడా క్రమబద్ధీకరణ పట్టాలు ప్రభుత్వం వద్దనే మూలుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నప్పటికీ భద్రద్రి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికి కొత్తగూడెం పట్టణ క్రమబద్ధీకరణ పట్టాలు మంజూరు కాకపోవడం ఎంతో బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాలు మంజూరు కాకపోతే ప్రజలు ఆర్థికంగా అవసరాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆస్తులు ఉన్నప్పటకీ అనుభవించలేక పోతున్నామని వాపోతున్నారు. పట్టాలు కూడా మంజూరైతే కొత్తగూడెం పట్టణం మరింత అభివ్%-%ద్ధి మరింత వేగవంతం అవుతుందని, ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్నట్లు ఉంది...

వందనపు సూర్య ప్రకాష్ రావు సీనియర్ సిటీజన్

కొత్తగూడెం పట్టణానికి పెండింగ్లో ఉన్న 2300 దరఖాస్తులు క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందో అర్థం కావడం లేదని పూర్తి స్థాయిలో సర్వే జరిపి సిసిఎల్ హైదరాబాద్ లో మంజూరుకు సిద్ధంగా ఉన్న క్రమబద్ధీకరణ పట్టాలపై సంబంధిత అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనుక జాప్యం జరుగుతుందని, కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నప్పటికీ అమ్మలేము.. కొనలేము అన్న పరిస్థితి ఉందని , అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారిందని సీనియర్ సిటీజన్ వందనపు సూర్య ప్రకాష్ రావు పేర్కొన్నారు.



# ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగళం

(మొదటి పేజీ తరువాయి)

అటెండర్ కిచ్చెల్లి రామకృష్ణ లు లంచం తీసుకుంటుండగా గురువారం అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందు మైనార్టీ గురుకుల పాఠశాలలో అవుట్సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న టీచర్ వేతనం చేసేందుకు ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ రూ. 10 వేలను డిమాండ్ చేశారని తెలిపారు. ఆ అవుట్ సోర్సింగ్ టీచర్ అభ్యర్థన మేరకు రూ. 2వేలు తీసుకునేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. గురువారం ఉదయం మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ను కలిసి డబ్బులు ఇస్తానని తెలపడంతో, సదరు ప్రిన్సిపాల్ అటెండర్ రామకృష్ణకు ఇవ్వమని సూచించారన్నారు. అటెండర్ రామకృష్ణ తీసుకున్న రూ. 2 వేల లంచాన్ని ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణకు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామని తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ, అటెండర్ కిచ్చెల్లి రామకృష్ణపై కేసు నమోదు చేసి ఏసిబి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచాలు డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతికి అందరూ బిజీనే!



పండుగ హడావిడిలో ఉండనున్నారు. ఇక పురుషులు మాత్రం ఎక్కువ శాతం సినిమాలకే ప్రాధాన్యత ఇస్తూ సందడి చేయనున్నారు. సంక్రాంతి పండుగ అంటే గాలిపటాలకు పెట్టింది పేరు. యువకులు మాత్రం గాలిపటాల జోష్ లో మునిగిపోనున్నారు. ఇక యువతులు సెల్ఫీల మోజులో మునిగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. సంక్రాంతి పండుగకు ప్రతి ఇంట్లో మహిళలు కష్టపడి చేసిన పిండి వంటలను చిన్నారులు, వృద్ధులు ఆరగించే పనులు నిమగ్నం కానున్నారు. అందరూ ఎవరికీ తోచిన వాటిలో ఉన్నప్పటికీ సాయంత్రానికి మాత్రం ఇంట్లో కలిసి సంతోషంగా ఉంటారు. ఇలా ఎవరికి వారు బిజీగా ఉండి సంక్రాంతి పండుగను ప్రతి కుటుంబం సంతోషంగా ఆనందంగా జరుపుకోవాలని ఆశీద్దాం.







# ధాన్యం బాపతు బోనస్ రూ. 3 కోట్లు రైతు ఖాతాల్లో జమ

## సొసైటీ చైర్మన్ మండె

**చుంచుపల్లి/జనవరి 9, (ప్రజాజ్యోతి) :**

స్థానిక హౌసింగ్ బోర్డు లోగల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.,కొత్తగూడెం(పిఎసిఎస్) కార్యలయంలో సొసైటి చైర్మన్ మండె వీరహనుమంతరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయటం జరిగినది. ఈ సందర్బంగా సొసైటి చైర్మన్ మండె వీరహనుమంతరావు గారు మాట్లడతూ, కొత్తగూడెం సొసైటి ద్వార నాలుగు మండలాలో 12 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వార 1120 మంది రైతుల వద్ద నుండి 60,000 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయటం జరిగినది, అట్టి ధాన్యం నకు సంబందించి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ 2320/ ల చోప్పున సుమారు 14 కొట్ల రూపాయలను రైతుల ఖాతలో జమచేయటం జరిగినది, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సన్నరకం ధాన్యం నకు ఇచ్చే బోనస్ క్వింటాకు రూ 500/- రూపాయల చోప్పున బోనస్ మొత్తం 3 కొట్ల రూపాయలను కూడా రైతుల ఖాతలో జమచేయటం జరినది అని, రైతులకు బోనస్ ఇస్తున్నందుకు గాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు రైతుల తరుపున సొసైటి తరుపున ధన్యవాదములు తెలియజేసారు, అలాగే ఇటివల ప్రభుత్వం విడుదల చేసిన రుణ మాఫీ నిధులు కూడా సంఘ రైతుల



ఖాతలో జమచేయటం జరిగినది అట్టి రైతులకు రుణాలు కూడా ఇవ్వటం జరుగుతుందని తెలియజేసారు, కొత్తగూడెం సంఘం ను పునర్విభజన చేయుటకు గాను కార్యవర్గం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానము చేసినారు అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సొసైటి ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్నాధరావు, సొసైటి డైరెక్టర్లు గుగులోతు చందర్, తిట్ల విజయకూమారి, పోటువెంకటేశ్వర రావు, గుగులోతు విజయ, కంటెం సత్యనారాయణ సంఘ సెక్రటరి పండ్ల సారయ్య పాల్గోన్నారు.

# మండలంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా విస్తృత పర్యటన

**దమ్మపేట/జనవరి09, (ప్రజాజ్యోతి):**

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం దమ్మపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో అన్నప్రాసన ,ఓణీల వేడుకలలో పాల్గొని మెచ్చా చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు తండ్రి,సోదరిల దశదిన కర్మలలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మొద్దులగూడెం పంచాయితీ పరిధిలోని పలువురిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి పై కుటుంబ సభ్యులను ఆరా తీశారు. ఈ కార్యక్రమం లో దమ్మపేట మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్, పార్టీ మండల కార్యదర్శి దొడ్డా రమేష్, ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసుబాబు ,సీనియర్ నాయకులు అంకత ఉమామహేశ్వరరావు, జలగం వాసు, మాజీ సర్పంచ్ లు రూప్ సింగ్ , ఉయ్యాల చిన్న వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రావూరి వీరయ్య , మైనార్టీ నాయకులు అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా




**ఇల్లందు/జనవరి 9, (ప్రజాజ్యోతి) :**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసీ ఆధ్వర్యంలో గురువారం జిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భభంగా ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి యండి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నెంబర్ 22 ప్రకారం వేతనాలను పెంచాలని, ఈఎస్ఐ ను అమలు చేయాలని, సంక్రాంతి పండుగ నేపథ్యంలో తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు. గతంలో సమస్యల పరిష్కారం కోసం సింగరేణి యాజమాన్యం 2022లో నిరవధిక సమ్మె సమయంలో చేసుకున్న ఒప్పందంలోని పెండింగ్ అంశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 6 నెలల నుండి ఈఎస్ఐకు చెల్లించవలసిన డబ్బులను తక్షణమే జమా చేసి కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులను ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని, సంక్రాంతి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణమే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిఎం వీసం కృష్ణయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి డివిజన్ అధ్యక్షులు జంగంపల్లి మోజెస్, నాయకులు ఎం. శ్రీనివాస్, పండు, లక్ష్మణ్, రాజలింగం, భావ్ సింగ్, తరుణ్, సురేష్, జగన్, ప్రణయ్,రాము, భువనేష్, సర్వయ్య, రవి, నీల ప్రసాద్, రాజ్ కుమార్, సుధీర్, గంగా, జమున, లీలావతి, కనకతార, ఎల్లమ్మ, సైదా తదితరులు పాల్గొన్నారు.

# సేయింట్ మేరీస్ పాఠశాలలో.. ఘనంగా సంక్రాంతి వేడుకలు



**కొత్తగూడెం/జనవరి 9 , (ప్రజాజ్యోతి) :**



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం కొత్తగూడెంలోని సేయింట్ మేరీస్ పాఠశాలలో విద్యార్థులకు ముందస్తు ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ ఎం. సిస్టర్ రూబి మాట్లాడుతూ మత సామరాస్యాలకు అతీతంగా సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రతీ పండుగ ప్రాచుర్యాన్ని విద్యార్థుల్లో తెలియజేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంక్రాంతి పర్వదినంలో ప్రతీ ఇళ్ల ముందు రంగు రంగుల ముచ్చటైన ముగ్గులను వేసి సంక్రాంతిని స్వాగతిస్తారని తెలిపారు. ముగ్గులలో గొబ్బెమ్మలు, గంగిరెద్దుల డు..డు.. బసవన్నలు ఆటలతో సంక్రాంతి శోభ సంతరించుకుంటుందనిన తెలిపారు. పాఠశాలలో అందమైన ముగ్గులు వేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపా ధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన అటవీశాఖ అధికారులు

**టేకులపల్లి/ జనవరి 09, (ప్రజాజ్యోతి) :**

నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వగృహం లో గురువారం అటవీ శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు



# గిరిజన చట్టాలు బేఖాతర్

**-అయ్యా నా భూమి నాకు ఇప్పించండి**
**-గిరిజన మహిళా వేడుకోలు**
**-రాజకీయ దౌర్జన్యం తట్టకోలేను**
**-సర్వే చేసి తేల్చిన ఇవ్వరెందుకూ**
**-కలెక్టర్ సారూ దృష్టి సారించాలని ఫిర్యాదు**

**చుంచుపల్లి/ జనవరి 9, (ప్రజాజ్యోతి) :**

గిరిజన తండాలో జీవనం కొనసాగిస్తున్న గిరిజన మహిళకు చెందిన భూమి ఇది. భూ పెత్తందారుల ఒత్తిడిలో నలుగుతున్న వైనం.. రెవిన్యూ శాఖ ప్రత్యేకంగా సర్వే చేసి గిరిజన మహిళకు చెందిన భూమిగా ధృవీకరించినప్పటికీ గిరిజనేతరుల రాజకీయ అండదండలతో ఆ మహిళకు తీరని అన్యాయం జరుగుతుంది. దీంతో ఆ మహిళా తిరగబడింది. న్యాయం కోరుతూ కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ మెట్లు ఎక్కింది. 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చుంచుపల్లి రెవిన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 137/13 నందు 4 ఎకరాల 19 కుంటలు పట్టా భూమి గిరిజన మహిళ అయినా భూక్య భద్రి పేరున మంజూరైంది. గతంలో ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ పరంగా సంక్రమించిన అట్టి భూమిలో రాష్ట్ర ప్రభుత్వం , జిల్లా కలెక్టర్, ఆర్డోఓ , తహసీల్థార్, సర్వేయర్లు ప్రత్యేకంగా సర్వే చేసి గిరిజన మహిళకు చెందిన భూమిని హద్దులు పంచనామ నిర్వహించి పట్టదారు పాసు పుస్తకం సైతం అందజేశారు. ఇటీవల ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంలో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన పట్టదారు పాసుపుస్తకం పొందారు . అంతేకాకుండా ప్రభుత్వ పరంగా సమకూరుతున్న రైతు బంధు పథకానికి కూడా అర్హులైంది. ఇదంతా ఉన్నప్పటికీ రాజకీయ అండదండలతో కొందరు గిరిజనేతరులు వారి భూమి సరి హద్దుల్లోకి వచ్చిందంటూ రాజకీయ పలుకుబడితో అనేక ఇబ్బందులకు గురి చేస్తూ తన భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డు పడుతున్నారని గిరిజన మహిళా వాపోతూ సంబంధిత జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లింది. గతంలో ఆ మహిళా పొలం చుట్టూ పెంచిన్ తీగలను విరగగొట్టి దౌర్జన్యంగా ధ్వంసం చేశారని కన్నీరు మున్నీరైంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎలాంటి ఫలితం లేదని గిరిజనులమైన మా పై కూడా ఒత్తిడి తెచ్చారని ఆరోపించింది. ప్రభుత్వం ఒక పక్క గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 యాక్ట్ అమలు చేస్తూ గిరిజనులకు సంక్రమింప చేయాల్సిన భూములను రాజకీయ అండదండలతో కొందరు గిరిజనేతరులు గిరిజన చట్టాలను ఉల్లంగించి తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించింది. చుంచుపల్లి రెవిన్యూ గ్రామంలో ఉన్న 137/13 భూముల్లో చట్టాలను ఉల్లంఘించి రియలెస్టేట్ వ్యాపారానికి పడిగులెత్తారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆరోపించింది. మా భూమమి అంటూ గిరిజనేతరులు అడ్డు తగులుతున్నారని అలాంటి వారి భూమిని రెవిన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు చూపాలని డిమాండ్ చేసింది. గిరిజనేతర భూమికి రెవిన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి పంచనామ నిర్వహించలేదని, హద్దులు కూడా పెట్టలేదని, సరిగా కొలతలు ఉన్నాయో లేదో చూడగలరని అధికారుల ఎదుట వాపోయింది. గిరిజనేతరులు ధౌర్జన్యం చేస్తూ గిరిజన మహిళనైన నన్ను చంపుతానని బెదిరించడం ఎంతవరకు న్యాయమని ప్రశించారు. తక్షణమే చుంచుపల్లి రెవిన్యూ గ్రామ పరిధిలో ఉన్న 137/13 సర్వే నెంబర్లో ఉన్న భూములను జిల్లా కలెక్టర్ మరొకసారి పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలని చేతులెత్తి వేడుకుంటున్నారు.



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



**టేకులపల్లి/ జనవరి 09, (ప్రజాజ్యోతి) :**
ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రార్థన సమయానికి చేరుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. సులానగర్ పాఠశాల విద్యార్థులు ప్రార్థన తీరును పరిశీలించిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హెచ్ఎం, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాక్షించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమును ఏర్పాటు చేసి ప్రభుత్వం విద్యారంగము ను రక్షించడానికి మండలిలో తన వంతు పాత్రను పోషిస్తున్నానని, ఉపాధ్యాయ సమస్యలతో పాటు జీవో నెం 317 బాధిత ఉపాధ్యాయ సమస్యలు పరిస్కారమునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల కోయగూడెం ను సందర్శించి ప్రత్యేకంగా 10 వ తరగతి విద్యార్థుల , ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ లో పండిట్, పిఈటి అప్గ్రేడ్ సమస్యను అతి త్వరలో పరిస్కారము చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి .రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు వాసం వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్ సింగ్, టేకులపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాన్ సింగ్, హరి కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వీరన్న, రవి, గురు ప్రసాద్, టి. లక్ష్మణ్ ,జిల్లా క్రీడా కన్వీనర్ బి. మంజిలాల్, ఉపాధ్యాయులు సునీత, కృష్ణ కుమారి, ముత్తు బాయమ్మ, దీప, వెంకటరెడ్డి, లక్ష్మయ్య, మురళీ, ఎం.బాలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన పారిశుద్ధ్య కార్మికులు



**ఇల్లందు/ జనవరి 9, (ప్రజాజ్యోతి)**
ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ను గురువారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల మున్సిపాలిటీ పాలకవర్గంలో పొందని హక్కులు సదుపాయాలు ఈ పాలకవర్గ కాలంలో మా కార్మికులు పొందారన్నారు. 26 జనవరి, ఆగస్టు 15న ఇల్లందు మున్సిపాలిటీలో కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ అవార్డులు తీసుకున్నామని పేర్కొన్నారు. పనికి సంబంధించి రాజీ లేకుండా వెంటబడి పని చేయించారని తెలిపారు. కార్మికుల హక్కులు, సౌకర్యాలు కూడా అమలు చేశారని ప్రశంసించారు. హెల్త్ క్యాంపులు, బట్టలు, కొబ్బరి నూనె, చెప్పులు కరోనా కష్ట సమయంలో తమ పనికి గుర్తింపుగా ఇల్లందు పట్టణ ప్రజలందరూ కూడా తమ సేవలను గుర్తించి పాలకవర్గం హయాంలో తమను ప్రోత్సహించారన్నారు. జనవరిలో పదవీకాలం ముగియడంతో చైర్మన్ ను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వారా రవి, అంకెపాక నవీన్, మున్సిపల్ కార్మికులు నాయిని కృష్ణ, సంజీవ్ సిహెచ్ కుమార్ బోయపొతుల వెంకన్న, భూలక్ష్మి భారతి, ఉమా, సంధ్య వరలక్ష్మి, బండారు లక్ష్మి, నాగమణి, వీరస్వామి, నాగరాజు, గొల్లమంద రాములు,అనిల్, ఉప్పరి కృష్ణ, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫాతిమా షేక్ జయంతి వేడుకలు

## మనం మరచిన మహనీయురాలు ఫాతిమా షేక్



**టేకులపల్లి/జనవరి 09, (జాజ్యోతి) :**
మనం మరచిన మహనీయురాలు ఫాతిమా షేక్ 192 వ జయంతి ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సులోచన రాణి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘసంస్కర్త, బడుగు బలహీనవర్గాల బహుజనుల, విద్యావ్యాప్తికై కృషి సల్పిన ఫాతిమా షేక్ మనందరికీ ఆదర్శనీ యురాలని ఫాతిమా షేక్ సావిత్రిబాయి పూలే ఇరువురు సహా ఉపాధ్యాయులుగా ఉంటూ ఒకరినొకరు సహకరించుకుంటూ ఆనాడు సమాజంలో బాలిక విద్య కొరకు కృషి చేసిన వారిని వీరితోపాటు రమాబాయి కూడా సామాజిక రుగ్మతలను దూరం చేయడంలో కృషి చేశారని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలలో బాలికల విద్యా వ్యాప్తి కోసం వారు చేసిన పోరాట ఫలాలను మనం అనుభవిస్తున్నామని గుర్తు చేశారు. కనుక విద్యార్థినులు అన్ని రంగాలలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యాపకుల ను గౌరవముగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బసవమ్మ సత్యవతి, ముంతాజ్ అలీ శంకర్రావు వేణుగోపాల్ శ్రీనివాసరావు, యాకూబ్, వరలక్ష్మి, ప్రమోద్ కుమార్ నాగేశ్వరరావు బాబురావు ,సంజీవరెడ్డి అధ్యాపకేతర సిబ్బంది రమేష్ బుల్లారావు సాంబయ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# జే.డీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ ఛాలెంజ్ ప్రారంభం

**భద్రాచలం టౌన్/ జనవరి 9(ప్రజాజ్యోతి) :**
జే.డీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ ఫ్రీ ఛాలెంజ్ సెల్ఫీ స్టాండ్ ని ఆలయ ఈవో రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018 నుంచి భద్రాచలం పట్టణంలో దేవస్థానం పరిసర ప్రాంతాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న జే.డీ ఫౌండేషన్ ని అభినందించారు. ఈ మేరకు ముక్కోటి సందర్భంగా జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వారి సహకారంతో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నిషేధం చాలెంజ్ అనే సెల్ఫీ పాయింట్ ని దేవస్థానం ప్రాంగణంలో ఈ.వో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి దేవస్థానం కూడా సహకరిస్తుందని ఇప్పుడున్న కాలానికి అనుగుణంగా విన్నూత్న పద్ధతిలో ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన ఆకట్టుకుందని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధానికి దేవస్థానం కూడా సహకరిస్తుందని, దేవస్థానం గోశాల వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీస్టాండ్ ని పలువురు భక్తులు, ప్రజలు అధికారులు సెల్ఫీలు తీసుకుని ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా జెడి ఫౌండేషన్ కన్వీనర్ మురళీమోహన్ ఈవో, అధికారులకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హన్సి, కడాలి నాగరాజు, యూసఫ్ మియా, అంబికా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి



**ఇల్లందు/ జనవరి 9, (ప్రజాజ్యోతి) :**
క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుణ్యానికి ఎంతో దోహదపడతాయని హెచ్ఎం జి. లింగా నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లింగా నాయక్, మాజీ ఎంపీటీసీ అజ్మీర బిచ్చ లు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తేనే మానసికంగా దృఢత్వంగా ఉంటారన్నారు. విద్యార్థులకు ఆటల పట్ల తనకున్న ఆసక్తిని విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో కూడా రాణించాలని అప్పుడే సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, వార్డు మెంబర్ శాంతారావు, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన తుమ్మల యుగంధర్...



**దమ్మపేట/ జపవరి09(ప్రజాజ్యోతి):**
ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ దీపదాస్ మున్షీలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువనాయకులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయులు డాక్టర్ తుమ్మల యుగంధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఏఐసీసీ నాయకులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# భద్రాచలం డిపో 45వ వార్షికోత్సవ సంబరాలు

**భద్రాచలం టౌన్/ జనవరి 9(ప్రజాజ్యోతి) :**
భద్రాచలం ఆర్ టీ సీ డిపో ఏర్పడి 44 సంవత్సరాలు పూర్తి చేసుకొని 45 వ సంవత్సరం లో అడుగు పెట్టిన సందర్భంగా గురువారం విశ్రాంత ఉద్యోగులు డిపో మేనేజర్ తిరుపతి సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు గత స్మృతులను గుర్తుచేసుకొన్నారు. ఈ సందర్భంగా 09-1-1981 న భద్రాచలం డిపో ని ప్రారంభించిన ఉద్యోగులైన వెంపటి. రాజు, బొర్రా వెంకట నరసింహారావు, బత్తుల విశాలాంధ్ర బాబు లను డిపో మేనేజర్ తిరుపతిని శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సి ఐ గౌతమీ, ఎం ఫ్ శ్రీనివాస్, డీసీ అల్లం నాగేశ్వరావు, వీర వెంకన్న, విశ్రాంత ఉద్యోగులు నారాయణ, వై వెంకటరావు, పి వెంకటరావు, మాధవరావు, కంట్రోలర్స్ విశ్రాంత ఉద్యోగులు ఎక్కువ సంఖ్య లో పాల్గొన్నారు.



# రాముడి దర్శనభాగ్యం సామాన్యులకా...వీఐపీలకా

**-అడుగడుగునా అధికార యంత్రాంగం ఆంక్షలు**
**-బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్**

**భద్రాచలం టౌన్ , జనవరి 9 (ప్రజాజ్యోతి ):** ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలంలో రాముడి దర్శనం కోసం వచ్చే భక్తులు, సామాన్యులకు అధికార యంత్రాంగం ఆంక్షలు విధిస్తుందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అధికారులతీరుపై మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ సామాన్య భక్తుల కన్నా వీఐపీలకే అధికార యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తుందని, భయటి నుంచి వచ్చే భక్తులు, స్థానికులకు రాముడి దర్శనభాగ్యం కల్పించే పరిస్థితి కనిపించడంలేదని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా భద్రాచలంలో ఉత్సవాలు జరుగుతున్నాయని, గతంలో ఎన్నడూలేనివిధంగా అధికారులు, పోలీసులు అత్యుత్సాహం చూపుతూ బారికేడ్లు అడుగడుగునా పెట్టి ఇబ్బందులు, ఆంక్షలకు గురిచేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు సిఫార్సు లెటర్లు ఇచ్చి ప్రజాప్రతినిధులు వచ్చినా, రాకపోయినా వారి పేర్లమీద పాసులు తీసుకుని సామాన్య భక్తుల కంటే ముందుగానే అనుచర యంత్రాంగం పాసులు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. అధికారులు ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్లు తీసుకుని ఆ ప్రజాప్రతినిధులు వస్తున్నారా... లేదో తెలుసుకుని పాసులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దైవదర్శనం ముందు అందరూ సమానులేననే సంకేతాన్ని అధికార యంత్రాంగం గుర్తుంచుకోవాలన్నారు.



# ఘనంగా కామ్రేడ్ తానం రవీందర్ 4వ వర్ధంతి

**రవీందర్ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి**
**సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు ఊకంటి రవికుమార్**

**ములకలపల్లి, జనవరి 09, ప్రజాజ్యోతి:** అమరజీవి కామ్రేడ్ తానం రవీందర్ ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలు ఉద్యమాలు నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఊకంటి రవికుమార్,నిమ్మల మధు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో అమరజీవి కామ్రేడ్ తానం రవీందర్ 4 వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి తానం రవీందర్ చిత్రపటానికి తన సోదరుడు తానం రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మధు, రవికుమార్ లు మాట్లాడుతూ మండలంలో ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నా సమస్యల పై నిరంతరం పోరాడుతూ గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉండే వారని అన్నారు. పోడు భూముల పోరాటాల్లో అనేక సార్లు సిపిఎం నాయకత్వం పై కేసులు పెడితే అనేక సార్లు జైలు జీవితం గడిపారని గిరిజన గ్రామాల అభివృద్ధికి అయన కృషి చేశారని గుర్తుచేశారు. దళితుల పై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాడని గిరిజన,గిరిజనేతర ప్రజలను ఐక్యం చేసి అనేక ఉద్యమాలు నిర్వహించారని అన్నారు.కరోన కష్ట కాలంలో మండల ప్రజలకు



నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేరని గుర్తు చేశారు. భవిష్యత్తులో మండలంలో అమరజీవి కామ్రేడ్ తానం రవీందర్ స్ఫూర్తి తో ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోండ్రు రాఘవయ్య, గడ్డం వెంకటేశ్వర్లు,కీసరి గంగరాజు, తాటి ముత్యాలు, మంచాల సారయ్య, దుబ్బ వెంకటేశ్వర్లు, చిట్టెమ్మ, రాధ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సత్తా చాటిన ప్రణీత్

**రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ లో మొదటి స్థానంలో మండల విద్యార్థి ఇనుకుర్తి ప్రణీత్**
**జాతీయ స్థాయి ప్రదర్శన కు దక్కిన అవకాశం**
**ప్రణీత కు పలువురు అభినందనలు**



ములకలపల్లి, జనవరి 09, ప్రజాజ్యోతి: మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ లో మండలంలోని జగన్నాధపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇనుకుర్తి ప్రణీత్ విన్నూతంగా ఆలోచించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి తన ప్రతిభనుచాటాడు. ప్రణీత్ ప్రదర్శించిన సేంద్రియ పద్దతి లో వ్యవసాయ సాగు విభాగం లో రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. తను ప్రదర్శన ద్వారా సేంద్రియ పద్దతిలో సాగు వలన లాభాలు, ఆరోగ్యానికి మేలు ఎలా చేస్తుందో వివరించి అందరిని ఆశ్చర్య పర్చి, తన ప్రతిభను చాటుకున్నాడు. ఇటీవల అన్నపురెడ్డి పల్లి లో జరిగిన జిల్లా స్థాయి ప్రదర్శనలో జిల్లా స్థాయి లో మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రదర్శన లో మొదటి స్థానంలో నిలిచి మరో సారి తన ప్రతిభ ను కనబర్చాడు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి, ప్రథమ స్థానంలో నిలిచిన ప్రణీత్ కు జాతీయ స్థాయి లో సౌత్ ఇండియా లెవల్ లో జరిగు ప్రదర్శన లో స్థానం కల్పించారు. గురువారం జడ్చర్లలో జరిగిన సైన్స్ ఫేర్ ముగింపు లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి ప్రణీత్, గైడ్ టీచర్ సారాలమ్మ కు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, చేతుల మీదుగా



అవార్డు అందించి ప్రసంచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మ, గైడ్ టీచర్ మందారి సారలమ్మ, ఉపాధ్యాయులు, ప్రణీత్ కు అభినందనలు తెలిపారు.




# అమ్మ జన్మనిస్తే... హెల్మెట్ పునర్జన్మ ఇస్తుంది

**-ఎంవీఐ వెంకటపుల్లయ్య**



**భద్రాచలం టౌన్,జనవరి 9 ప్రజాజ్యోతి :** రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వినియోగం చేస్తే ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మ ఇస్తుందని, రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, నిబంధనలు తప్పకుండా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహనదారుడు వాహనపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న "చేతన మీసేవ " రంజిత్

**భద్రాచలం టౌన్, జనవరి 9(ప్రజాజ్యోతి )**



భద్రాచలం పట్టణం లోని అంబేద్కర్ సెంటర్ నందు కలకత్తా కు చెందిన కుటుంబం ఖమ్మం చేరుకునేందుకు చార్జీలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్ రాజ్ ,యంఆర్పియస్ జిల్లా నాయకులు అలవాల రాజా లు చేతన మీసేవ " రంజిత్ కు సమాచారం తెలపడంతో ...రంజిత్ అక్కడికి చేరుకొని ఖమ్మం వెళ్లేందుకు చార్జి డబ్బులు ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్ రాజ్ ,యంఆర్పియస్ జిల్లా నాయకులు అలవాల రాజా ల చేతుల మీదుగా వారికి ఇప్పించి రంజిత్ మానవత్వం చాటుకున్నారు. రంజిత్ చేసిన ఈ సహాయాన్ని పట్టణంలో పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు రంజిత్ ని అభినందించారు.

# అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**భద్రాచలం, జనవరి 9 (ప్రజాజ్యోతి ):** అగ్నిప్రమాదాలను నివారించేందుకు భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సౌకర్యార్థం నూతనంగా మంజూరైన అగ్నిమాపక వాహనాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం ఫైర్ స్టేషన్ పరిధిలో ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా ఏజెన్సీ ప్రాంతం కావడంతో మరో అగ్నిమాపక వాహనాన్ని ప్రభుత్వం మంజూరు చేయడంతో ఈ ప్రాంత ప్రజల అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

